సాక్షి
జగిత్యాల
సోమవారం । 1 । సెప్టెంబర్ । 2025



ఘనంగా గణనాథుడి నిమజ్జనం

పెగడపల్లి: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ప్రతిష్ఠించిన గణనాథుడి నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. పోలీస్ స్టేషన్ నుంచి యాపల్ చెరువు వరకు ఆటపాటలతో వెళ్లారు. ఎస్సై కిరణ్‌కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



పట్టణంలో సైకిల్ రేస్ ర్యాలీ

జగిత్యాలటౌన్: జాతీయ క్రీడల దినోత్సవ సందర్భంగా జిల్లా యువజన, క్రీడల శాఖ సైకిల్ రేస్ ర్యాలీ నిర్వహించింది. డీఆర్డీవో రఘువరన్ జెండా ఊపి ప్రారంభించారు. బాక్సింగ్ కోచ్ నవీన్, క్రీడల అధికారి రవికుమార్ పాల్గొన్నారు.

గరిష్టం/కనిష్టం
29.0/23.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. కొన్నిచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది. ఈదురుగాలులు కొనసాగుతాయి.

న్యూస్‌రీల్

బాలసదన్‌ను సందర్శించిన సబ్ జడ్జి



చిన్నారులతో సెల్ఫీ దిగుతున్న సబ్ జడ్జి శర్మ

జగిత్యాలజోన్: జిల్లా కేంద్రంలోని బాలసదన్‌ను ఆదివారం జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి, సబ్ జడ్జి వెంకటమల్లిక్ సుబ్రహ్మణ్య శర్మ సందర్శించారు. చిన్నారులతో ముచ్చటించి, వారి బాగోగులను తెలుసుకున్నారు. బాగా చదువుకోవాలని, పెద్దయిన తర్వాత సమాజానికి ఉపయోగపడాలని సూచించారు. చిన్నారుల ఆరోగ్య పరిస్థితులపై నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చిన్నారులతో సెల్ఫీ దిగారు. కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పొట్టువత్తిని సతీశ్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ రాచకొండ విజయ్, బాల సదన్ సిబ్బంది పాల్గొన్నారు.

యూరియా కోసం రైతుల తిప్పలు



సారంగాపూర్ విండో ముందు భూమి జిరాక్స్ కాపీలు ఉంచి నిరీక్షిస్తున్న రైతులు

సారంగాపూర్: యూరియా కోసం రైతులకు తిప్పలు తప్పడం లేదు. సారంగాపూర్ సింగిల్ విండో కార్యాలయం ముందు ఆదివారం రైతులు వరి, మొక్కజొన్న, ఇతర పంటలకు యూరియా అందించడానికి తమ భూమి పాసుపుస్తకాల జిరాక్స్ కాపీలను లైన్లలో ఉంచి తమ పేరు రాగానే టోకెన్ తీసుకుని యూరియా తీసుకుంటున్నారు. సారంగాపూర్‌కు 230 యూరియా బస్తాలు రాగా.. 72 మంది రైతులకు పంపిణీ చేసినట్లు విండో సీఈవో లైశెట్టి శివ, మండల వ్యవసాయాధికారి ప్రదీప్‌రెడ్డి తెలిపారు.

ఎస్సారెస్పీకి 3.70లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



ప్రాజెక్టు నుంచి విడుదలవుతున్న నీరు

జగిత్యాలఅగ్రికల్చర్: శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాల నుంచి ఆదివారం 3.70 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. 38 గేట్ల ద్వారా 3 లక్షల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదులుతున్నారు. వరదకాలువకు 18వేల క్యూసెక్కులు, కాకతీయ కాలువకు 4500, ఎస్కేప్ గేట్ల ద్వారా 3500, మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాల | పూర్తయ్యేదెన్నడో..?

- నిధులు లేక నిలిచిన పనులు
- బాలబాలికల ఇబ్బందులు



కూల్చివేసిన పాత భవనం

ఇది జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల. మన బస్తీ మన బడి పథకం కింద ఎంపికైంది. 2023 ఏప్రిల్ 14న ఎంపిక కాగా అప్పటి మంత్రి కొప్పుల ఈశ్వర్ పనులు ప్రారంభించారు. ఈ స్కూల్‌కు రూ.2.33 కోట్లు కేటాయించారు. పనులు ప్రారంభించినా.. ఇప్పటివరకు పనులు పూర్తి కాలేదు. గతంలో ఉన్న పాత భవనం కూల్చివేసి కొత్తగా పునాదులు వేసి పిల్లర్లు వేసి వదిలేశారు. కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక పోయిందన్న చందంగా మారింది పాఠశాల పరిస్థితి. ఇది బాలికల పాఠశాల కావడంతో బాలికలకు అదనపు గదులు లేక ఇబ్బందులకు గురవుతున్నారు.



పాత భవనం స్థలంలో కొనసాగుతున్న పనులు

జగిత్యాల: పాఠశాల విద్యను బలోపేతం చేయాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం అనేక రకాల చర్యలు చేపడుతోంది. కార్పొరేట్ తరహాలో పాఠశాలల్లో నాణ్యమైన విద్యనందించేలా చర్యలు తీసుకుంటోంది. ఈ మధ్యనే జిల్లాలో 51 స్కూళ్లలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్సీ (ఏఐ)ని అందుబాటులోకి వచ్చింది. గతంలో ఉన్న పాఠశాలల్లో మాత్రం మరమ్మతుకు మాత్రం నోచుకోవడం లేదు. గత ప్రభుత్వంలో పాఠశాలల మరమ్మతుల కోసం మన ఊరు మన బడి పథకాన్ని తీసుకొచ్చారు. మున్సిపాలిటీల్లో మన బస్తీ మన బడి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మొత్తం జిల్లాలో 277 స్కూళ్లను ఎంపిక చేయగా ఇప్పటివరకు 47 మాత్రమే పూర్తయ్యాయి. అలాగే టాయ్‌లెట్స్, కలర్స్, బెంచీలు, కిచెన్‌షెడ్స్ వంటి కాంపోనెంట్స్ 1087 మంజూరు కాగా.. 446 మాత్రమే పూర్తయ్యాయి. కొన్నిటిలో పనులు కొనసాగుతున్నాయి. అంతేకాక ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అమ్మ ఆదర్శ పాఠశాల పథకం కింద 517 పాఠశాలలను మరమ్మతు కోసం ఎంపిక చేశారు. ఇవి కూడా పూర్తి కాలేదు. మన ఊరు మన బడి పథకం కింద రూ.119 కోట్లు మంజూరు కాగా.. రూ.67 కోట్లు మాత్రమే వచ్చాయి. ఇంకా రూ.27 కోట్లు రావాల్సి ఉంది. ఫలితంగా కాంట్రాక్టర్లు పనులు నిలిపివేశారు. ఇది విద్యార్థులకు ఇబ్బందికరంగా మారింది.

ఉన్న వాటిని కూల్చేశారు..

జిల్లాలోని కొన్ని పాఠశాలల్లో పాత గదుల్లో ఎలాగోలా కొనసాగించేవారు. మన ఊరు మన బడి పథకం కింద ఎంపిక కావడంతో ఆ పాత భవనాలను కూల్చివేశారు. పునాదులు తీసి పిల్లర్లు వేశారు. కానీ ఎక్కడా భవనాలు పూర్తికాలేదు. కేవలం 48 మాత్రమే పూర్తయ్యాయి. ఇంకా 229 స్కూళ్లు పూర్తి కావాల్సి ఉంది.

విద్యార్థుల ఇబ్బందులు

పాఠశాలల్లో అదనపు గదులు లేకపోవడంతో విద్యార్థులు నానా ఇబ్బందులకు గురవుతున్నారు. విద్యాశాఖ స్పందించి పాఠశాల గదులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. గదులు లేకపోవడంతో చెట్ల కింద, ఏదో చిన్నచిన్న గదుల్లోనే నిర్వహిస్తున్నారు. బాలికలకైతే కొన్ని చోట్ల చదువుకునేందుకు ఇబ్బందికరంగా మారింది. ప్రభుత్వం స్పందించి వెంటనే బడ్జెట్ రిలీజ్ చేసి పథకం కింద ఎంపికైన స్కూళ్లలో మరమ్మతు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మన ఊరు-మన బడి ఇలా..

మంజూరైన స్కూళ్లు	277
కేటాయించిన బడ్జెట్	రూ.119 కోట్లు
మంజూరైన కాంపోనెంట్స్	1087
వచ్చిన బడ్జెట్	రూ.67 కోట్లు
కేటాయించిన బడ్జెట్	రూ.67 కోట్లు
పనులు పూర్తయిన పాఠశాలలు	48
పూర్తయిన కాంపోనెంట్స్	446

బడ్జెట్ రాగానే పనులు



బడ్జెట్ రాగానే పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. అమ్మ ఆదర్శ పాఠశాల కింద కొన్ని మరమ్మతు చేపట్టాం. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుంది.

– రాము, డీఈవో

కదలని పనులు



ఎస్సీ కాలనీలో పిచ్చిమొక్కలు, రోడ్డుపై పారుతున్న మురుగునీరు

- ఇదీ రూ.1.74 కోట్ల అభివృద్ధి పనుల తీరు
- 8 నెలలుగా పనులు ప్రారంభించని వైనం

కథలాపూర్: ఎస్సీ జనాభా అధికంగా ఉన్న గ్రామాల్లో సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. సీఆర్ఆర్, స్పెషల్ కాంపోనెంట్ ప్లాన్ నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులు మంజూరై సుమారు 8 నెలలు గడుస్తున్నప్పటికి పనుల్లో కదలిక లేకపోవడంతో ప్రజల్లో అసంతృప్తి నెలకొంది. రోడ్లకు మహర్దశ వచ్చిందని సంతోషపడ్డామని, పనులు ప్రారంభించడంలో జాప్యం చేయొద్దని ఆయా గ్రామాల్లోని ప్రజలు కోరుతున్నారు.

సీసీ రోడ్లు, డ్రైనేజీలకు రూ.1.74 కోట్లు మంజూరు

కథలాపూర్ మండలంలోని 18 గ్రామాల్లో ఎస్సీ వాడల్లో ప్రత్యేకంగా సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలకు ఈ ఏడాది జనవరిలో రూ.1.74 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. ఎస్సీ కాలనీల్లో మట్టిరోడ్లు, బురద రోడ్లు ఉన్నచోట సీసీ రోడ్లు, మురికి నీరు వెళ్లేందుకు వీలుగా డ్రైనేజీల కోసం ఈ నిధులు కేటాయించారు. ఆయా గ్రామాల్లోని ఎస్సీ వాడల్లోని ప్రజల అవసరాలను గుర్తించి ఈ పనులను మంజూరు చేశారు. ఇదంతా బాగానే ఉన్నా.. ఇప్పటికీ పనులు ప్రారంభించకపోవడంపై కాలనీవాసులు నిరాశ వ్యక్తం చేస్తున్నారు. ఈ పనులు చేసేందుకు నాయకులు ముందుకు రాకపోవడంపై ప్రజల్లో సందేహాలు నెలకొన్నాయి. అభివృద్ధి పనులు చేస్తే బిల్లులు సకాలంలో రాకపోవడం మరో కారణమని ప్రజలు పేర్కొంటున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టిసారించి అభివృద్ధి పనులకు మంజూరైన నిధులతో పనులు త్వరగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పనులు ప్రారంభిస్తేనే ప్రయోజనం



ఎస్సీ కాలనీల్లో అభివృద్ధి పనులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం మంచిదే. ఆ పనులు త్వరగా ప్రారంభించి పూర్తి చేయించే బాధ్యత పాలకులు, అధికారులు తీసుకోవాలి. అప్పుడే అభివృద్ధి జరిగినట్లు.. నిధులు మంజూరైనట్లు ఆర్భాటం చేసి పనులు చేపట్టకపోవడం దారుణం. ఎస్సీ కాలనీల్లో అభివృద్ధి పనులు త్వరగా ప్రారంభించాలి.

– తెడ్డు మహేశ్, సిరికొండ

పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం



ఎస్సీ కాలనీల్లో అభివృద్ధి పనులకు నిధులు మంజూరయ్యాయి. ఆ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం. పనులు చేపట్టేవారు ముందుకొస్తే వారికి పనులు అప్పగిస్తాం. నిబంధనల ప్రకారం అభివృద్ధి పనులు చేస్తే బిల్లులు మంజూరవుతాయి.

– జగదీశ్వర్, పంచాయతీరాజ్‌శాఖ ఏఈ, కథలాపూర్

ఆరోగ్యశ్రీ నిలిచిపోవడం బాధాకరం

- అసెంబ్లీలో ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్

కోరుట్ల: రాష్ట్రంలో ఆరోగ్య శ్రీ సేవలు నిలిచిపోవటం బాధాకరమని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. శాసనసభలో ఎమ్మెల్యే ఆదివారం మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఆరోగ్యశ్రీని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచుతామని చెప్పిన కాంగ్రెస్.. ఇప్పుడు కనీసం బిల్లులు కూడా చెల్లించకపోవటం బాధాకరమన్నారు. కోరుట్ల నియోజకవర్గంలో కోరుట్ల, మెట్‌పల్లి ఆస్పత్రిలో సమస్యలపై ఎన్నిసార్లు మాట్లాడినా ఒక్కటీ నెరవేరలేదని, అసెంబ్లీలో అడుగుపెట్టినప్పటి నుంచీ ప్రస్తావిస్తున్నా.. పట్టించుకోవట్లేదని పేర్కొన్నారు. మంచం పట్టిన మాన్యం అని చిన్న వయసులో చూశానని, మళ్లీ ఇలాంటి న్యూస్ చూస్తున్నానని పేర్కొన్నారు. కోరుట్ల, మెట్‌పల్లి ఆసుపత్రుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని కంటిన్యూ చేయాలని కోరారు. ఆశావర్కర్ల వేతనాలు పెంచాలన్నారు.

మహాగణనాథునికి 108 రకాల నైవేద్యాలు



రాయికల్‌లోని సంఘమిత్ర సంఘం ఆధ్వర్యంలో 108 నైవేద్యాలు

రాయికల్: రాయికల్ పట్టణంలోని సంఘమిత్ర యువజన సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణనాథుని ఆదివారం 108 రకాల నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యక్షులు జిల్లాల సుధాకర్‌రెడ్డి, కార్యదర్శి జిల్లాల సూర్యం, కోశాధికారి పాలడుగు అనిల్‌తోపాటు యువజన సంఘ సభ్యులు మహిళలు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ సేవాభావాన్ని అలవర్చుకోవాలి

- అదనపు కలెక్టర్ బీఎస్.లత



బియ్యం దాతలు విద్యార్థులతో బీఎస్.లత

జగిత్యాలటౌన్: సమాజంలోని ప్రతి వ్యక్తి సేవాభావాన్ని అలవర్చుకోవాలని అదనపు కలెక్టర్ బీఎస్.లత కోరారు. జిల్లాకేంద్రంలోని సేవాభారతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాల్మీకి ఆవాసం శాశ్వత బియ్యం దాతల సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా దాతలు ఆవాసానికి 60 క్వింటాళ్ల బియ్యాన్ని అందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సేవాభారతి ఆధ్వర్యంలోని వాల్మీకి ఆవాసం పాఠశాల గ్రామీణ నిరుపేద విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన ఉచిత విద్య, వసతి అందించడం అభినందనీయమన్నారు. ఏటా ఆవాసం విద్యార్థులకు సరిపడా బియ్యాన్ని ఉచితంగా అందిస్తున్న శాశ్వత బియ్యం దాతలను ఆమె ప్రత్యేకంగా అభినందించారు. వాల్మీకి ఆవాసం అధ్యక్షులు జిడిగె పురుషోత్తం, కోశాధికారి సిరిపురం శ్రీనివాస్, ఎలగందుల కైలాసం, సభ్యులు అశోక్‌రావు, సంపూర్ణాచారి, గౌరిశెట్టి హరీశ్, రాజేశుని శ్రీనివాస్, గుండ సురేష్, యాంసాని సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలను నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వం

- జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత



మాట్లాడుతున్న జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ వసంత

జగిత్యాలరూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాలను నిర్లక్ష్యం చేస్తుందని జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. ఆదివారం జగిత్యాలరూరల్ మండలం రఘురాములకోటలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వ హయంలో పల్లెల అభివృద్ధికి అప్పటి సీఎం కేసీఆర్ ఎంతగానో కృషి చేశారని పేర్కొన్నారు. పల్లెప్రగతి పేరిట పారిశుధ్యం, మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక శ్రద్ధ వహించారని తెలిపారు. వైకుంఠధామాలు, చెత్త సేకరణకు ట్రాక్టర్లు, క్రీడామైదానాలు, హరితహారం ద్వారా కోట్లాది మొక్కలు నాటామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం పల్లెలో కనీస వసతులు కల్పించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆనందరావు, మాజీ సర్పంచులు ప్రవీణ్ గౌడ్, గంగారాం, అంజయ్య, నాయకులు లక్ష్మణ్, కమలాకర్‌రావు, హరీశ్, రాజేందర్ పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి



నాయకులకు దిశానిర్దేశం చేస్తున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

వెల్గటూర్: త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలని మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ఆదివారం స్థానిక ఎన్నికలపై ముఖ్య నాయకులతో కరీంనగర్‌లో సమీక్షించారు. నాయకులు అందరూ కలిసి పనిచేయాలని సూచించారు. గ్రామస్థాయిలో ప్రజలకు దగ్గరగా ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు. పార్టీలో ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి సంక్షేమంపై ప్రజలకు వివరించాలని సూచించారు. అలాగే ఓటర్ల జాబితాలో ఏవైనా తప్పులు ఉన్నా.. అక్రమంగా తొలగించిన ఓటర్లను గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని తెలిపారు. కార్యక్రమంలో వెల్గటూర్ మండల బీఆర్ఎస్ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

తీరని ఆశలు.. ఆగని ఆందోళనలు

- మూడేళ్ల ఆందోళనలకు దక్కని భరోసా
- ఉద్యోగ భద్రత, ఫిక్స్‌డ్ వేతనం కోసం పోరాటం



మానవహారం, బస్‌జాతాలో నిరసనలు(ఫైల్)



కలెక్టరేట్ ఎదుట ఆందోళనలో ఆశావర్కర్లు (ఫైల్)

జగిత్యాలటౌన్: ప్రభుత్వ వైద్యం ప్రజలకు చేర్చడంలో ముందున్న ఆశవర్కర్లు తమ డిమాండ్ల సాధనలో మాత్రం పురోగతి సాధించలేక పోతున్నామంటున్నారు. గర్భిణులు ఆరోగ్య పరీక్షలకు హెల్త్ కేంద్రాలకు తరలించడంతోపాటు వైద్య విభాగంలో ఏఎన్‌ఎంలకు చేదోడువాదోడుగా ఉంటూ గ్రామీణ, పట్టణ ప్రజలకు అనేక రకాలైన వైద్యసేవలను అందిస్తున్న తాము.. ఉద్యోగ భద్రత కరువై స్కీం వర్కర్లుగానే మిగిలిపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుప్రీంకోర్టు ఉత్తర్వులను అనుసరించి సమాన పనికి సమాన వేతనం ప్రాతిపదికన రూ.18వేల ఫిక్స్‌డ్ వేతనంతోపాటు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ అనేక ఆందోళనలు చేస్తున్నా ఫలితం లేదంటున్నారు. ఎన్ని ఆందోళనలు చేసినా ప్రభుత్వం నుంచి స్పందన అంతంతమాత్రంగా ఉందంటున్నారు. మూడేళ్లుగా చలో హైదరాబాద్.. చలో కలెక్టరేట్.. బస్ జాతాలు, కలెక్టరేట్, ఎమ్మెల్యేల ఇళ్లముట్టడి, పాదయాత్రలు, మానవహారాలు, వంటావార్పులు ఒక్కటేమిటి అనేక రకాలుగా నిరసన తెలుపుతున్నా.. ఎలాంటి భరోసా దక్కడం లేదంటున్నారు. అన్నిరకాల వైద్య సేవలతోపాటు ప్రభుత్వం నిర్దేశించిన పలు సర్వే విధులను నిర్వర్తిస్తున్న తమకు న్యాయం చేయాలంటూ అధికారులు, ప్రభుత్వాన్ని వేడుకుంటున్నా ఫలితం లేదంటున్నారు ఆశవర్కర్లు.

జిల్లాలో మండలాలు	18
హెల్త్ సబ్‌సెంటర్లు	176
ఆశావర్కర్లు	739

(ప్రతి వెయ్యిమంది జనాభాకు ఆశావర్కర్)

ఆశాల డిమాండ్లు

- రూ.18వేల ఫిక్స్‌డ్ వేతనం, పీఎఫ్‌ఐ, ఈఎస్‌ఐ, ఉద్యోగ భద్రత.
- ఏఎన్‌ఎం ట్రెనింగ్ పూర్తి చేసిన ఆశాలకు ఏఎన్‌ఎం నియామకాల్లో వెయిటేజీ ఇవ్వాలి
- 15 రోజుల సమ్మె హామీలు, కాంగ్రెస్ ప్రభుత్వ మేనిఫెస్టో హామీలు అమలు చేయాలి
- గతంలో ఇచ్చిన హామీ మేరకు రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలి
- మట్టి ఖర్చుల కింద రూ 50వేల చెల్లించాలి
- ప్రతి ఆదివారం, పండుగలకు సెలవులు వర్తింపచేయాలి
- ఏఎన్‌సీ, పీఎన్‌సీ టార్గెట్స్ రద్దు చేయాలి
- రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5లక్షలు చెల్లించాలి
- 20రోజుల వేతనంతో కూడిన సెలవులు ఇవ్వాలి
- 6నెలల మెడికల్, ప్రసూతి సెలవులు ఇవ్వాలి
- 6నెలల పీఆర్సీ ఏరియర్స్ విడుదల చేయాలి
- ఆశాలపై పనిభారం తగ్గించాలి
- ఆస్పత్రుల్లో రెస్ట్‌రూం సౌకర్యం కల్పించాలి

హామీలు అమలు చేయాలి



2023 సెప్టెంబర్ 25 నుంచి అక్టోబర్ 9వరకు 15రోజులపాటు రాష్ట్ర వ్యాప్త ఆందోళనలతోపాటు హైదరాబాద్ నగరంలోని కోఠి హెల్త్ కమిషనరేట్ ఎదుట వేలాది మంది ఆశావర్కర్లు ధర్నా సందర్భంగా ఇచ్చిన ఇచ్చిన హామీలు అమలు చేయాలి.

– ఇందూరి సులోచన, ఆశావర్కర్స్ గౌరవాధ్యక్షురాలు

కాంగ్రెస్ మాట నిలబెట్టుకోవాలి



ప్రజలకు ఆరోగ్య సూచనలు, సలహాలతోపాటు అన్ని రకాల వైద్య సేవలు అందిస్తున్న మాకు రూ.18వేల ఫిక్స్‌డ్ వేతనంతోపాటు ఉద్యోగ భద్రత కల్పించి ప్రభుత్వం తన మాట నిలబెట్టుకోవాలి.

– ఆత్మకూరు లత, జిల్లా అధ్యక్షురాలు

ఫిక్స్‌డ్ వేతనం చెల్లించాలి




నామమాత్రపు పారితోషికం కాకుండా సమాన పనికి సమాన వేతనం ప్రాతిపదికన 18వేల ఫిక్స్‌డ్ వేతనం అమలు చేయాలి.

– మెట్టు మమత జిల్లా కార్యదర్శి

ఆకట్టుకుంటున్న వినాయకులు



భీమునిదుబ్బలో 18 ఫీట్ల ఎత్తైన వినాయకుడు



ఫిల్టర్‌బెడ్ వద్ద ఖర్జూర పండ్ల గణపతి ఆకారం

పట్టణంలో నెలకొల్పిన గణనాథులు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఇందిరారోడ్ పోచమ్మగుడి వద్ద గరుడ బాయ్స్ 24 ఫీట్ల ఎత్తులో ఐదు తలల గణనాథుడు, భీమునిదుబ్బలో 18 ఫీట్ల వినాయకుడు, వారాహి యూత్ నాగసర్పంపై 18 ఫీట్ల ఎత్తైన గణపతి, చిన్నతోట వాడలో విద్యాగణపతి ఆకార రూపం, ఫిల్టర్‌బెడ్ వద్ద స్నేహశీలి యూత్ వారు 4,516 ఖర్జూర పండ్లతో, కాలేజీ గ్రౌండ్ శ్రీదుర్గా ఆలయం వద్ద గరుడ పక్షిపై లంబోదరుడి విగ్రహాలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి.

– కోరుట్ల/కోరుట్లటౌన్



చిన్నతోటవాడ విద్యగణపతి ఆకారంలో



శ్రీదుర్గా దేవాలయం వద్ద గరుడ పక్షిపై లంబోదరుడు

క్లుప్తంగా

7న కొండగట్టు ఆలయం మూసివేత

మల్యాల(చొప్పదండి): రాహుగ్రస్త చంద్రగ్రహణాన్ని పురస్కరించుకొని ఈనెల 7న ఆదివారం రాత్రి కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయాన్ని మూసివేయనున్నట్లు ఆలయ ఈవో శ్రీకాంత్‌రావు తెలిపారు. ఆరోజు అన్ని ఆర్జిత సేవలు రద్దు చేస్తున్నామని, మధ్యాహ్నం 12.30గంటలకు స్వామివారికి నివేదన అనంతరం ద్వారబంధనం చేయనున్నట్లు పేర్కొన్నారు. 8న సోమవారం ఉదయం నుంచి యథావిధిగా భక్తులకు సర్వ దర్శనం, ఆర్జిత సేవలు ప్రారంభమవుతాయని తెలిపారు.

వాహనం ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

మంథనిరూరల్: మంథని మండలం ఎగ్లాస్‌పూర్ సమీపంలో గాడుదుల గండి వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొని మతిస్థిమితం సరిగా లేని, గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. ఎస్సై రమేశ్ తెలిపిన వివరాలు.. ఆదివారం మంథని– కాటారం ప్రధాన రహదారిపై జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడనే సమాచారం అందిందని, అతడు మతిస్థిమితం జరిగా లేక గ్రామంలో తిరిగేవాడని గ్రామస్తులు తెలిపారని ఎస్సై వివరించారు. గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మృతిచెందినట్లు అందిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. సదరు వ్యక్తి ఆచూకీ తెలిసినవారు మంథని పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

చికిత్స పొందుతూ యువకుడు..


రాజశేఖర్ (ఫైల్)

ధర్మపురి: ప్రమాదవశాత్తు ద్విచక్రవాహనంపై నుంచి కిందపడి గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్సై ఉదయ్‌కుమార్ తెలిపిన వివరాలు.. మంచిర్యాల జిల్లా జన్నారం మండలం పొనకల్ గ్రామానికి చెందిన దుమ్మల రాజశేఖర్ (26) జూన్ 16న ధర్మపురి మండలం ఆకసాయిపల్లె గుట్టమలుపు వద్ద ద్విచక్రవాహనంపై వెళ్తూ ప్రమాదవశాత్తు కిందపడగా తలకు తీవ్ర గాయాలయ్యాయి. వైద్యం కోసం కరీంనగర్ తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పిడుగుపాటుకు రైతు దుర్మరణం


మల్లయ్య (ఫైల్)

కమాన్‌పూర్(మంథని): మండలంలోని గుండారం గ్రామానికి చెందిన రైతు గరిగంటి మల్లయ్య ఆదివారం మధ్యాహ్నం పిడుగుపడి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. మల్లయ్య గుండారం రిజర్వాయర్ కట్ట కింద తన పొలానికి ఎరువుల మందు చల్లడానికి వెళ్లాడు. పొలంలో మందు చల్లుతుండగా పిడుగుపడి మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు.

‘ప్రయోగ’ విద్యపై ఆసక్తి

- ప్రభుత్వ పాఠశాలల్లో సైన్స్ ప్రయోగాలు
- విద్యార్థుల్లో నైపుణ్యం మెరుగు
- సైన్స్, ఇంజినీరింగ్ వైపు అడుగులు



‘ఈ ఫొటోలోని విద్యార్థులు ఎల్లారెడ్డిపేట ప్రభుత్వ పాఠశాలకు చెందినవారు. స్కూల్‌లోని అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో ప్రయోగాలు చేస్తున్నారు. సైన్స్ పాఠ్యాంశంలో భాగంగా ఉపాధ్యాయులు బోధించిన పాఠ్యాంశాన్ని విద్యార్థులు ఇలా ప్రయోగాలు చేసి అవగాహన పెంచుకుంటున్నారు. దీంతో వారిలో పరిశోధన, సృజనాత్మకత పెంపొందుతోంది’.



‘ఇది ఎల్లారెడ్డిపేట హైస్కూల్‌లోని అటల్ టింకరింగ్ ల్యాబ్. ఇలాంటి ల్యాబ్‌లు రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా 26 ప్రభుత్వ హైస్కూళ్లకు కేటాయించారు. ఒక్కో ల్యాబ్‌కు దాదాపు రూ.15లక్షలు వెచ్చించి ఏర్పాటు చేశారు. రానున్న రోజుల్లో ఏటీఎల్ ల్యాబ్‌లు క్రియాశీలకంగా మారనున్నాయి. రానున్న తరాలవారు కొత్తకొత్త ఆలోచనలతో నూతనంగా ఆవిష్కరణలు చేయడానికి కావాల్సిన సైన్స్ పరికరాలు పాఠశాలలకు చేరాయి’.


ఎల్లారెడ్డిపేట హైస్కూల్‌లో సూక్ష్మదర్శినితో పరిశీలిస్తున్న విద్యార్థులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో సైన్స్ దృక్పథం పెంచడమే లక్ష్యంగా హైస్కూళ్లలో అటల్ టింకరింగ్ ల్యాబ్స్(ఏటీఎల్స్)ను ఏర్పాటు చేసింది. ప్రభుత్వ విద్యాసంస్థల విద్యార్థుల్లో గణితం, ఇంజినీరింగ్, సైన్స్ అంశాల్లో మెరుగు పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం అటల్ ఇన్నోవేషన్ పథకంలో భాగంగా ఈ ల్యాబ్‌లను ఏర్పాటు చేసింది. జిల్లాలోని 26 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో అటల్ టింకరింగ్ ల్యాబ్స్ ఏర్పాటు చేసి.. విద్యార్థుల్లో ప్రయోగాలపై ఆసక్తి పెంచుతున్నారు.

ప్రయోగాలే లక్ష్యంగా..

గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రయోగాల గురించి పెద్దగా తెలిసేది కాదు. దీంతో విద్యార్థులు సైన్స్‌లో వెనుకబడి ఉండేవారు. దీన్ని అధిగమించేందుకు ప్రభుత్వం ఏటీఎల్స్‌ను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులకు సిద్దిపేటలో శిక్షణ ఇచ్చారు. జిల్లా వ్యాప్తంగా ఐదు పీఎంశ్రీ స్కూళ్ల నుంచి ముగ్గురు చొప్పున మొత్తం 15 మంది ఉపాధ్యాయులకు శిక్షణకు వెళ్లి వచ్చారు. వీరు తమ స్కూళ్లలోని విద్యార్థులతో వివిధ ప్రయోగాలు చేయిస్తున్నారు.

ల్యాబ్ పరికరాలు ఇలా..

అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ బోర్డులు, త్రీడీ ప్రింటింగ్‌మిషన్, మినీ కుట్టుమిషన్, టెలిస్కోప్, అడినోబోర్డ్స్, మూడు ల్యాప్‌టాప్స్, ఒక ప్రొజెక్టర్‌లను అందుబాటులో ఉంచారు.

పాఠ్యాంశాలపై అవగాహన



అటల్‌టింకరింగ్ ల్యాబ్‌లు ఏర్పాటయ్యాక విద్యార్థులు సైన్స్ ప్రయోగాలపై ఆసక్తి చూపుతున్నారు. దీని ద్వారా విద్యార్థుల హాజరు శాతం పెరుగుతుంది. సైన్స్ పాఠ్యాంశాలు శ్రద్ధగా వింటున్నారు. అటల్‌టింకరింగ్ ల్యాబ్‌లలో ప్రయోగాలు చేస్తూ పాఠ్యాంశాలపై సమగ్రంగా అవగాహన పొందుతున్నారు. దీంతో విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందుతుంది.

– మనోహరాచారి, స్కూల్‌కాంప్లెక్స్ హెచ్‌ఎం, ఎల్లారెడ్డిపేట

అల్ఫోర్స్ కళాశాలలో మహాలింగార్చన

కొత్తపల్లి(కరీంనగర్): విఘ్నేశ్వరస్వామి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కొత్తపల్లిలోని అల్ఫోర్స్ బాలికల జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో ఆదివారం మహాలింగార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ డా.వి.నరేందర్‌రెడ్డి –డాక్టర్ వనజారెడ్డి దంపతులు పాల్గొని పూజలు నిర్వహించారు. మట్టితో తయారు చేసిన 108 లింగాలకు ప్రాణ ప్రతిష్ఠ చేసి వివిధ ద్రవ్యాలు, పుష్పాలు, పంచామృతాలతో అభిషేకం చేశారు. అనంతరం నైవేద్యాలు సమర్పించారు. విద్యార్థినులకు రుత్వికులు ఆశీర్వచనం అందజేశారు.


మహాలింగార్చనలో నరేందర్‌రెడ్డి దంపతులు

గణేశ్ మండపాల్లో చోరీ

బోయినపల్లి: మండలంలోని కొదురుపాక ఆర్‌అండ్ఆర్ కాలనీలోని పలు వినాయక మండపాల్లో శనివారం రాత్రి చోరీ జరిగింది. కొదురుపాక రోడ్ నంబర్–14 వినాయక మండపంలో రూ.55 వేల విలువ గల ఆంప్లీఫైర్, రోడ్ నంబర్–8 మండపంలో ఒక ఆంప్లీఫైర్, రెండు సౌండ్‌బాక్స్‌లు, హుండీ, రోడ్‌నంబర్–5 గణేశ్ మండపంలో ఆంప్లీఫైర్‌ను దొంగలు ఎత్తుకెళ్లినట్లు నిర్వాహకులు తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

పోలీసుల అదుపులో అపరిచిత వ్యక్తి

బోయినపల్లి మండలం వరదవెల్లి అనుబంధ రాజన్నపేట గ్రామంలో ఓ వ్యక్తి ఇంట్లో ఆదివారం ఉదయం ఓ అపరిచిత వ్యక్తి ఒపెన్ స్లాబ్‌లో పడుకుని ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు. రాత్రి గోడ దూకి ఆ ఇంట్లోకి చొరబడ్డట్లు చెప్పారు. దీంతో అతడిని పోలీసులకు అప్పగించారు. కాగా, అతను కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం శాంతినగర్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించినట్లు ఎస్సై రమాకాంత్ చెప్పారు. మద్యం మత్తులో వచ్చినట్లు, విచారిస్తున్నట్లు పేర్కొన్నారు.

కోతికి అంత్యక్రియలు


వానరానికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న గ్రామస్తులు

పెద్దపల్లిరూరల్: ప్రమాదవశాత్తు ఓ కోతి మరణించి ఉండడాన్ని గమనించిన స్థానికులు ముందుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించిన ఘటన పెద్దపల్లి మండలం కుర్మపల్లిలో ఆదివారం జరిగింది.. స్థానికుల కథనం ప్రకారం..ఏమైందో ఏమో కానీ ఓ కోతి మరణించి ఉంది.. దానిని గమనించి కోతికి అంతిమసంస్కారం చేయాలని నిశ్చయించుకుని అందుకు ఏర్పాట్లు చేశారు. మరణించిన కోతికి పూలమాల వేసి జైశ్రీరాం అని నినదిస్తూ అంతిమసంస్కారం నిర్వహించారు. ఓ గోతిని తవ్వి అందులో పూడ్చి వేసినట్టు గ్రామస్తులు జడల శ్రీనివాస్, తిరుపతి, ఓదెలు, ప్రశాంత్, అరుణ్‌కుమార్, రమేశ్, రామాంజనేయులు రామస్వామి తదితరులు తెలిపారు.

ఆటోట్రాలీ బోల్తా.. ఇద్దరికి తీవ్రగాయాలు


తీవ్రంగా గాయపడిన విద్యార్థి

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): ఆటవిడుపుగా క్రికెట్ మ్యాచ్ ఆడుకొని వస్తున్న విద్యార్థుల ఆటోట్రాలీ బోల్తాపడడంతో 13 మందికి స్వల్ప, ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. స్థానిక పోతన కాలనీలోని ఓ గణేశ్ మండపం నిర్వాహకులు ఆదివారం 26 మంది విద్యార్థులకు సింగరేణి స్కూల్ గ్రౌండ్‌లో క్రికెట్ మ్యాచ్ నిర్వహించారు. మ్యాచ్ అనంతరం ఆటోట్రాలీలో పోతనకాలనీకి వస్తున్న క్రమంలో మూలమలుపు వద్ద ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. సుమారు 15 మంది విద్యార్థులకు గాయాలు కాగా, శ్రీనేయన్, ఆద్విత్ తీవ్రంగా గాయపడ్డారు. తల్లిదండ్రులు ఘటన స్థలానికి చేరుకొని చిన్నారులను వివిధ ఆస్పత్రులకు తరలించారు. కాగా, ఒకరిని కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించినట్లు తెలిసింది. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని టూటౌన్ పోలీసులు తెలిపారు.

గర్భిణి హత్య కేసులో నలుగురి అరెస్ట్

ఇల్లందకుంట(హుజూరాబాద్): గర్భిణి హత్య కేసులో నలుగురిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఆదివారం జమ్మికుంటరూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌చార్జి ఏసీపీ శ్రీనివాస్‌జీ వివరాలు వెల్లడించారు. ఇల్లందకుంట మండలం టేకుర్తికి చెందిన ముద్రబోయిన రాములు కథలు చెప్పుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. 20 ఏళ్ల క్రితం ఇదే మండలం కనగర్తికి చెందిన రేణుకతో వివాహమైంది. వీరికి ఇద్దరు కొడుకులు అభిషేక్, బన్నీతేజ. ఒకసారి వరంగల్ వెళ్లి వస్తున్న క్రమంలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ భర్తతో వేరుగా ఉంటున్న చిగురుమామిడి మండలం బొమ్మనపల్లికి చెందిన తిరుమల(32)తో పరిచయం ఏర్పడింది. 8 ఏళ్ల క్రితం తిరుమలను రాములు రెండో పెళ్లి చేసుకుని టేకుర్తిలో వేరే కాపురం పెట్టాడు. దీంతో మొదటి భార్య, ఆమె కొడుకులు తిరుమలపై కక్ష పెంచుకుని తరచూ గొడవ పడుతుండేవారు. ప్రస్తుతం తిరుమల 7నెలల గర్భిణి. తిరుమల గర్భిణి కావడం ఇష్టంలేని భర్త రాములు, మొదటి భార్య రేణుక, కొడుకులు ఆమెను చంపేయాలని నిర్ణయించుకున్నారు. వీరి చిన్నకుమారుడు బన్నీతేజను హత్యకు ప్రేరేపించారు. ఆన్‌లైన్‌లో కత్తి కొనుగోలు చేశారు. అదును చూసి తిరుమల ఒంటరిగా ఇంట్లో ఉన్న సమయంలో బన్నీతేజ ఆమె గొంతు కోసి, విచక్షణరహితంగా పొడిచి చంపేశాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. నలుగురిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. సమావేశంలో జమ్మికుంట రూరల్, పట్టణ సీఐలు లక్ష్మీనారాయణ, రామకృష్ణ, ఎస్సై క్రాంతికుమార్ పాల్గొన్నారు.


నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు


భారీ వృక్షం తరలింపు

గంగాధర(చొప్పదండి): ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రి నర్సరీ నుంచి మహారాష్ట్రలోని పూణే నర్సరీకి తరలిస్తున్న పెద్ద రావిచెట్టు ఆదివారం గంగాధర మండలం మంగపేట సమీపంలో కరీంనగర్–జగిత్యాల ప్రధాన రహదారిపై రైల్వే ట్రాక్ వద్ద కనిపించింది. రైల్వేగేట్ వద్ద ఉన్న గేట్లను తాకకుండా లారీతో పాటు చెట్టు ఎత్తును పరిశీలించి జాగ్రత్తగా తరలించారు.

భార్య, కూతురును ఇంటి నుంచి గెంటేసిన భర్త

- సీఐఎస్‌ఎఫ్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న భర్త
- పోలీసు ఉన్నతాధికారులు న్యాయం చేయాలని వేడుకుంటున్న బాధితురాలు


భర్త గెంటేయడంతో సామగ్రి వద్ద కూతురుతో స్రవంతి

చిగురుమామిడి: భర్త ఇంటినుంచి గెంటేయడంతో తనకు న్యాయం చేయాలని వేడుకుంటోంది ఓ బాధితురాలు.. చిగురుమామిడి మండలంలోని చిన్నముల్కనూర్‌కు చెందిన స్రవంతికి ఇదే మండలం సుందరగిరికి చెందిన వ్యక్తితో 2011లో వివాహం జరిగింది. సదరు వ్యక్తి సీఐఎస్‌ఎఫ్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తూ హైదరాబాద్‌లో ఉంటున్నాడు. కొద్దిరోజులు వీరి కాపురం సజావుగానే సాగింది. వీరికి 12 ఏళ్ల కూతురు ఉంది. కొద్దిరోజులుగా స్రవంతిని భర్త వేధిస్తున్నాడు. ఆమె అత్తగారిల్లయిన సుందరగిరిలో ఉంటోంది. భర్త వేధింపులు భరించలేక చిగురుమామిడి, కరీంనగర్ మహిళా పోలీస్ స్టేషన్‌లలో పలుసార్లు ఫిర్యాదు చేసింది. వారు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో అతడి ఆగడాలకు అంతులేకుండాపోయిందని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ క్రమంలో సదరు వ్యక్తి ఆదివారం సుందరగిరికి చేరుకుని స్రవంతి, కూతురును ఇంటినుంచి వెళ్లగొట్టాడు. వారి సామగ్రి బయట పడేయడంతో తల్లీకూతురు కన్నీరుమున్నీరుగా విలపించారు. పోలీసులు, గ్రామస్తులు ఎవరూ పట్టించుకోవడం లేదని, పోలీసు ఉన్నతాధికారులైనా తనకు న్యాయం చేయాలని బాధితురాలు వేడుకుంటోంది.

దొరకని నాగయ్య ఆచూకీ

- ఎగువమానేరు పరీవాహక ప్రాంతంలో అధికారుల గాలింపు
- ఐదు రోజులుగా కుటుంబ సభ్యుల రోదనలు


నాగయ్య కోసం గాలిస్తున్న బృందం సభ్యులు

గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేట మండలం నర్మాల ఎగువమానేరు వాగులో ఐదురోజుల క్రితం గల్లంతైన పంపుకాడి నాగయ్య ఆచూకీ ఇంకా లభించలేదు. ఈ నెల 27న నాగయ్య పశువుల మేత నిమిత్తం మానేరు వైపు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో ఎగువమానేరువాగు ఉప్పొంగింది. దీంతో లోలెవల్ వంతెనపై వస్తున్న నాగయ్య మానేరు నీటి ప్రవాహంలో కొట్టుకుపోయాడు. అతడి ఆచూకీ కోసం అధికారులు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ ఆదేశాల మేరకు ఐదు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. రెవెన్యూ, నీటి పారుదల, పోలీస్, ఎస్‌డీఆర్‌ఎఫ్ అధికారులతో ఒక్కో టీంలో ఆరుగురిని నియమించి నర్మాల, లింగన్నపేట, మల్లారెడ్డిపేట, వెంకటాపూర్, సిరిసిల్ల, మధ్యమానేరు వరకు గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఐదు రోజులైనా నాగయ్య ఆచూకీ లభించకపోవడంతో అతడి భార్య లక్ష్మి, కుమారుడు సాయికిరణ్, కుమార్తె మౌనిక రోదనలు ఆగడం లేదు. ఇప్పటికే కేంద్ర మంత్రి బండి సంజయ్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్ బాధిత కుటుంబానికి మనోధైర్యం కల్పించారు.

నెలక్రితం తండ్రి.. ఇప్పుడు కొడుకు..

- బైక్ అదుపుతప్పి దుర్మరణం
- తండ్రి మరణించడంతో నిద్ర కోసం బంధువుల ఇంటికి వెళ్తుండగా ప్రమాదం


నవీన్ (ఫైల్)

ఇల్లంతకుంట(మానకొండూర్): నెల క్రితం తండ్రి చనిపోగా.. నిద్ర కోసం ఆదివారం తన అన్నతో కలిసి బంధువుల ఇంటికి బైకుపై వెళ్తుండగా జరిగిన ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. ఇల్లంతకుంట మండలం దాచారం గ్రామానికి చెందిన జక్కుల నవీన్ (30), రామచంద్రం సోదరుల తండ్రి నెల రోజుల క్రితం చనిపోయాడు. ఈక్రమంలో హైదరాబాదులో ఉన్న తన చిన్న తమ్ముడి అత్తగారింటికి నిద్ర కోసమని నవీన్, రామచంద్రం ఆదివారం మధ్యాహ్నం బైక్‌పై బయలుదేరారు. సిద్దిపేట జిల్లా కుకునూరుపల్లి సమీపంలో హైవే రోడ్డుపై ప్రమాదవశాత్తు కిందపడ్డారు. ఈ ప్రమాదంలో నవీన్ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందగా, రామచంద్రంకు స్వల్ప గాయాలయ్యాయి. కాగా నవీన్‌కు ఇంతకుముందు ఓసారి వ్యవసాయ బావిలో పడగా గాయాలయ్యాయని, మరోసారి ప్రమాదానికి గురికాగా కాలు విరిగిందని గ్రామస్తులు పేర్కొన్నారు. మతుడికి భార్య శ్రీవాణి, కొడుకు అనన్యన్, కూతురు అనన్య ఉన్నారు. నెల వ్యవధిలో ఒకే ఇంట్లో ఇద్దరు మృతిచెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

రైలు ఢీకొని వ్యక్తి దుర్మరణం


విజయ్‌కుమార్ (ఫైల్)

రామగుండం: మతిస్థిమితం సరిగా లేని వ్యక్తి రైలు ప్రమాదంలో మృతిచెందాడు. జీఆర్పీ ఔట్‌పోస్టు ఇన్‌చార్జి తిరుపతి తెలిపిన వివరాలు.. స్థానిక అక్బర్‌నగర్‌కు చెందిన మాడిశెట్టి విజయ్‌కుమార్(62) కొంతకాలంగా మతిస్థిమితం సరిగా లేక రైల్వేస్టేషన్ పరిసరాల్లో తిరుగుతుండేవాడు. ఆదివారం రైల్వేస్టేషన్ ప్రాంగణంలోని ప్లాట్‌ఫాం రైలు పట్టాలపై దిగి నడుచుకుంటూ వెళ్తున్న క్రమంలో చెన్నై నుంచి న్యూఢిల్లీ వెళ్తున్న తమిళనాడు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఢీకొని అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. మృతుడికి కొడుకు, ఇద్దరు కూతుర్లున్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తిరుపతి పేర్కొన్నారు.

రైలు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి..

రామగుండం: రామగుండం రైల్వేస్టేషన్ ఒకటో నంబర్ ప్లాట్‌ఫాం చివరన ఆదివారం ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. జీఆర్పీ ఔట్‌పోస్టు ఇన్‌చార్జి తిరుపతి తెలిపిన వివరాలు.. సుమారు 40 ఏళ్ల వయస్సు గల గుర్తుతెలియని వ్యక్తి రైలు పట్టాలపై నుంచి వెళ్తున్న క్రమంలో గుర్తుతెలియని రైలు ఢీకొనిఅక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడు డార్క్ గ్రే కలర్ హాఫ్ టీ షర్ట్, నలుపు లోయర్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. అతడి వద్ద ఏలాంటి గుర్తింపు కార్డులు, నగదు, వస్తువులు లభ్యం కాలేదు. మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం గోదావరిఖని ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుడి బంధువులు ఎవరైనా ఉంటే 99493 04574, 87126 58604 నంబర్లలో సంప్రదించాలని కోరారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

బెట్టింగ్ బాబోయ్..

- ఆన్‌లైన్ వేదికగా ఆట
- వచ్చేది గోరంత.. పోయేది కొండంత
- వీధిపాలవుతున్న కుటుంబాలు
- చెప్పుకోలేక ఆత్మహత్యలు

‘చందుర్తి మండలానికి చెందిన యువకుడు హైదరాబాద్‌లోని ఓ కంపెనీలో పని చేస్తున్నాడు. స్నేహితులకు ఫోన్ చేసి తనకు అత్యవసరంగా రూ.2 లక్షలు కావాలని, జీతం రాగానే ఇస్తానని తెలిపాడు. కొన్నాళ్లు ఇలాగే తన ఫ్రెండ్స్ వద్ద దాదాపు రూ.50 లక్షలు అప్పు చేశాడు. అప్పు ఇచ్చినవారందరూ ఆరా తీయగా, బెట్టింగ్‌లో పెట్టి నష్టం వచ్చినట్లు తెలుసుకున్నారు. చివరకు అతడి అమ్మానాన్న పొలం అమ్మి అప్పులు చెల్లించారు’.

‘సిరిసిల్ల పట్టణానికి చెందిన వ్యక్తి చిట్‌ఫండ్స్‌లో పని చేసేవాడు. అతడికి రోజువారీ కలెక్షన్‌లో వచ్చిన సొమ్మును కొంచెంకొంచెం ఆన్‌లైన్ బెట్టింగ్‌లో పెట్టేవాడు. ఆఫీస్‌కు కలెక్షన్ తక్కువ చూపేవాడు. కొద్దిరోజులకు అలా తీసిన సొమ్ము రూ.లక్ష వరకు చేరింది. బెట్టింగ్‌లో డబ్బు పోవడంతో కలెక్షన్ చేసిన సొమ్ము ఆఫీసుకు ఎలా ఇవ్వాలో తెలియక ఆత్మహత్య చేసుకున్నాడు’.



సిరిసిల్లక్రైం: క్షణాల్లో లక్షలు సంపాదించేందుకు పలువురు ఆన్‌లైన్‌లో మార్గాలను వెతుకుతున్నారు. బెట్టింగ్ యాప్‌లలో పెట్టుబడులు పెడుతున్నారు. నిమిషాల వ్యవధిలో పెట్టిన సొమ్ముకు ఎక్కువ రావడంతో ముందుగా రూ.వందలతో ప్రారంభించిన బెట్టింగ్.. రూ.లక్షల్లోకి చేరుకొని తీరా క్షణాల్లోనే నష్టాలను చవిచూసి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

రావడం కాదు.. పోవడమే..

ఇదివరకు చాలామంది పేకాట, మట్కా ఆడుతూ లక్షల రూపాయలు పోగొట్టుకోవడమే కాకుండా కటకటాలకు వెళ్లినవారున్నారు. ప్రస్తుతం సులభంగా డబ్బు సంపాదించే ప్రక్రియ రూటు మారింది. కొంతమంది స్టాక్ మార్కెట్లో డబ్బులు వస్తున్నాయన్న ప్రచారంతో దానిలో అనుభవం లేకపోయినా పెట్టుబడి పెట్టి నష్టాలపాలవుతున్నారు. దీనికి సమాంతరంగా ప్రస్తుతం బెట్టింగ్ యాప్‌లు అందుబాటులోకి వచ్చాయి. ఏదేని సామాజిక మాధ్యమంలో సినిమా, సీరియల్, జోక్స్ వీక్షించే క్రమంలో వచ్చే ప్రకటనలతో ఆకర్షితులై ఆన్లైన్ యాప్‌లను డౌన్లోడ్ చేసుకొని పెట్టుబడులు పెడుతున్నారు. నిమిషాల వ్యవధిలో ఒకట్రెండు దఫాలుగా లాభాలు రావడంతో మరికొంత సంపాదించుకుందామనే క్రమంలో కొండంత నష్టాన్ని చవిచూస్తున్నారు. బెట్టింగ్ వ్యసనంతో పలువురు వ్యాపారులు, ఉద్యోగులు, యువకులు చివరకు చావు మీదకు తెచ్చుకుంటున్నారు.

కృత్రిమ సమస్యలు సృష్టిస్తూ..

బెట్టింగ్ జరిపే సమయంలో ఇంటర్నెట్ సమస్య ఉంటే ఇక అకౌంట్లో జమ చేసిన డబ్బులన్నీ మాయం అయినట్లే. కాగా బెట్టింగ్ యాప్ నిర్వాహకులే ఎదో ఒక రకంగా ఇంటర్‌నెట్‌కు అంతరాయం కలిగించి, వందలాది మంది నుంచి కోట్లాది రూపాయలు దోచుకుంటున్నారు. బెట్టింగ్ చేసే వ్యక్తి ఫోన్ నంబర్‌ను సంబంధిత యాప్ డౌన్లోడ్ చేసే సమయంలో నమోదు చేయడంతో, ఆ నంబర్‌కు యాప్ నిర్వాహకులే బెట్టింగ్ సమయంలో కాల్ చేసి అంతరాయం కలిగిస్తున్నట్లు విశ్లేషకులు చెబుతున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం



సులభమార్గంలో డబ్బు వచ్చే విధానాలను నమ్మవద్దు. బెట్టింగ్ యాప్‌లతో జరుగుతున్న ఆర్థిక నష్టంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నాం. స్టాక్, సైబర్, బెట్టింగ్, రమ్మీ తదితర ఆన్‌లైన్ గేమ్స్‌పై కఠిన నిఘా కొనసాగుతోంది. యువకులు, వ్యాపారులు తమకు ఏమైనా సమస్యలు ఉంటే నిపుణుల సలహాలు తీసుకొని ముందుకెళ్లాలి.

– మహేశ్ బీ గితే, ఎస్పీ, రాజన్న సిరిసిల్ల